తెలుగు కళా సమితి న్యూజెర్సీ కథల పోటీలో రూ.300/-లు బహుమతి పొందిన కథ

# మచ్చుకో జీవితం



— మోహన్

కర్ణ కఠోరంగా ఘీంకరిస్తూ దూసుకుపోయింది లారీ. రేగిన దుమ్ముకి వుక్కిరిబిక్కిరై చేస్తున్న పనాపి 'థూ! థూ!' అని ఉమ్మేస్తూ లారీ వెళ్ళిన వైపు కోపంగా చూసి గొణుక్కున్నాడు మాణిక్యం.

అతని పళ్ళబిగువున అస్పష్టంగా వెలువడిన ఆ శబ్ద తరంగాన్ని ఎన్‌లైజ్ చేస్తే, అది లారీ డ్రైవర్ తల్లినో, లేక లారీ తల్లినో సంబోధించి తిట్టిన బూతు తిట్టవుతుంది.

హిర మండలం ఊరికి కాస్త ఎడంగా త్రారోడ్డుని ఆనుకొని మర్రి చెట్టు పక్కగా వుంది - మాణిక్యం ఫ్రేమింగ్ కొట్టు. రోడ్డుపై నుంచి చూస్తే జవసత్వాలుడిగిపోయిన వృద్ధ దంపతుల్లా కనిపిస్తాయి. చెట్టూ కొట్టూ నడుం వంగిపోయి ఊత కోసం ఊడని దింపుకొంది చెట్టు. తలపైనున్న నాచుబారిన 'ఆస్‌బెస్టాస్' రూఫ్‌ని కొన ఊపిరితో మోస్తుంది కొట్టు. కొట్లో ఓ మూల బూజు పట్టిన చెక్క మందిరంలో పాత దేవుడు గత వైభవాన్ని తలచుకుంటున్నాడు. ఫ్రేములు కట్టిన పటాల్లోంచి కొత్త దేవుళ్ళు తమని కొనే భక్తుల కోసం ఎదురు చూస్తున్నారు. కొట్టు ముందు చెక్క ఫ్రేముల్ని ద్రితిక పట్టేందుకు వేసిన కొయ్యబల్ల చెద పురుగులకి ఆశ్రయంగా వుంది.

రోడ్డు కావల అంతా పచ్చటి మైదానం. కొద్ది దూరంలో కొత్తగా లేచిన సినీమా హాలు మట్టూ టీ కొట్లూ కిల్లీ బడ్డీలూ... మినిస్టర్ మట్టూ రౌడీల్లా మూగివున్నాయి. హాలుపై తళ తళలాడిపోతున్న కట్ అవుట్‌లో తడిసిన చీరలోంచి అందాల్ని అరబెట్టుకుంటూ కవ్విస్తోంది - అప్పుడే పైకెదుగుతున్న సినీమాస్టారు.

చివరి మరమేకుని బిగించి పటాన్ని పెట్టేసి టైమెంతయిందో అన్నట్టు ఆకాశంలోకి చూశాడు మాణిక్యం.

ఎర్రగా కందిపోయిన సూర్యుడు పడమటి కొండంచుపై అలసటగా గడ్డం ఆన్చి వున్నాడు. అంతవరకు లూప్ రోడ్ కన్‌స్ట్రక్షన్‌లో మట్టి తవ్వి పోసిన కూలీలు పారా పలుగూ సర్దుకుని చెట్టు దగ్గరకు చేరుకున్నారు. తమని తీసుకుపోయే లారీ కోసం ఆడామగా గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. అందులో ఓ కూలీ వెంకన్న మరో ఆడ కూలీని ఉద్దేశించి ఏదో బూతు సినిమా పాట పాడుతున్నాడు, సందర్భోచిత సైగలతో. ఆమె సిగ్గుతో వంకర్లు తిరిగిపోతూ మధ్య మధ్యలో కోపాన్ని అభినయిస్తూ అతనిపైకి మట్టి బెడ్డల్ని రువ్వుతోంది.

నాలుగు దాటిందని అంచనా వేసుకున్న మాణిక్యం... "మేనేజర్ బాబింకా రాలేదేం?" అనుకొంటూ బీడీ వెలిగించుకున్నాడు. ఒక్క క్షణం తరువాత ఏదో నిశ్చయానికొచ్చిన వాడిలా లేచి కొట్టు మూసేసి సినీమా హాలు వైపు నడిచాడు.

"ఏటి మానిక్కెం మావా! అప్పుడే కొట్టు కట్టేసినావు... తీరతం పుచ్చీసుకోడానికే నేటి పయానం..." పరిహాసం చేసాడు పరిచయస్తుడైన కూలీల మేస్త్రి.

"తీరతం గీరతం నేదెహే. సిల్లికానీ నేక జేబు బొక్కడి పోనాది... మేనేజరు బాబు కాడికి ఎల్తొత్తాను" అంటూ ముందుకు సాగిపోయాడు.

సినీమా హాలు మేనేజరు ఆర్డరిచ్చిన పటాలు తయారయ్యేయి. ఇవాళ డబ్బిచ్చి తీసుకెళ్ళతానన్నాడు. అందుకే ఆత్రంగా అంతవరకూ ఎదురు చూసేడు మాణిక్యం. వాడికి పొద్దుగూకే సరికి జేబులో ఎంతో కొంత డబ్బుపడాల. లేకపోతే కడుపులో 'సుక్క' పడదు. సాయంకాలమయ్యే సరికి సుక్కేసుకో పోతే అక్వేరియంలోంచి పైకి పడిన చేప పిల్లలా గిలగిల్లాడిపోతాడు. అయితే ఆ వేళ మాత్రం వాడు సుక్క గురించి ఆలోచించడం లేదు. "అయ్యా! అమ్మావు పుత్తకం కొనవా?" అనడుగుతున్న బుజ్జిగాడే మెదలుతున్నాడు. బుజ్జిగాడు మాణిక్యం ఏకైక సంతానం. ఎంత తాగినా మాణిక్యం వాడి గురించి 'కజ్జి ముండ' కొనుక్కెల్లడం మాత్రం మరచిపోడు. బుజ్జిగాడు కూడా ఎంత పొద్దుపోయినా సందు చివర నిలబడి తండ్రి రాకకు ఎదురు చూస్తుంటాడు. మాణిక్యం ఆడ్ని చూడగానే కజ్జి ముండ చేతికిచ్చి గుర్రప్పుందు వేసుకుని ఇంటికి తీసుకెల్తాడు.

మాణిక్యం వయసు నలభైకి ఎక్కువుండదు. అయినా విపరీతమైన తాగుడు వల్ల యాభైకి పైపడినట్టు వుంటాడు. వాడి మొహంలోకి చూడగానే కనిపించేవి ఎర్రని జ్యోతుల్లాంటి కళ్ళే. పీక్కుపోయిన దవడలపై ఎప్పుడూసహం మొలిచి వుంటుంది సహం పండిన గడ్డం. ఎప్పుడో తన శ్వేత వర్ణాన్ని కోల్పోయిన,ముడుకులపైకెత్తి కట్టిన పంచె. మద్యం కొరికి డొల్ల చేసేయగా మిగిలిన బొమికల స్ట్రక్చర్‌పై వేలాడుతూ చొక్కా.

పూర్వపు మాణిక్యాన్ని ఎరిగున్న వాళ్ళెవరైనా

ఇప్పుడు చూస్తే 'అయ్యో' అని జాలి పడకుండా వుండలేరు. మొదట్లో మాణిక్యం నల్లరాతి స్తంభంలా వుండేవాడు. పాలీషు పెట్టిన పాత బర్మా టేకు పందిరి మంచం కోళ్ళు లాగుండేవి వాడి చేతులు. పటాలు కట్టడంలో వాడికి జిల్లా స్థాయిలో పేరుండేది. సిద్ధాంతం దొరల ఇళ్ళలో వున్న నిలువెత్తు పటాలన్నీ వాడు కట్టినవే.

పాత హిర మండలంలో మాణిక్యానికి సొంత ఇల్లు కూడా వుండేది. వాడి కొట్టు చందనం అగరొత్తుల గుబాళింపుతో అంచెలంచెలుగా పేర్చిన దేవుడి పటాలతో వైకుంఠంలా కళకళ లాడేది.

బరటాం నుంచి మనసుపడి మనువాడి తెచ్చు కున్న పెళ్ళాం కనకాన్ని చూసుకుని 'నగిషీ ఫ్రేమేసి కట్టిన సీతామాలచ్చివి పటంలాగుంద'ని మురిసిపోయేవాడు. మురిపించే పెళ్ళాంపై వాడు కురిపించిన ప్రేమకు ఫలితంగా ఆమె నెల తప్పకుండానే నెల తప్పింది. ఏడాదితిరక్కుండానే బుజ్జిగాడు పుట్టాడు.

అప్పటివరకూ మాణిక్యం సంపాదనతో సంసారం ఇరుసులో నూనె పోసిన చక్రంలా స్మరున సాగిపోయేది. సరిగ్గా అప్పుడే పరిచయం అయ్యేడు సత్తెం మేస్త్రి ఇరుసులో రాయి పడింది.

సత్తెం మేస్త్రి ఊసెత్తితే చాలు... "ఈడ్ని సెడిపింది ఆ తాగుబోతు సచ్చినోడే" అంటూ ఇస్సుమ్మంటుంది కనకం.

సత్తెం మేస్త్రి "ఓవర్ హెడ్ కేబుల్స్" వేయడంలో ఉద్దండుడు. అతనితో టౌను కెళ్ళి నప్పుడు మొట్టమొదట మందు రుచి చూసాడు మాణిక్యం. నోటికి చేదనిపించినా... ఆ అనుభూతి కొత్తగా వింతగా అనిపించింది. అలా మొదలెట్టిన కొద్ది రోజుల్లోనే సత్తెం మేస్త్రీకి సమవుజ్జీ కాగలిగేడు.

"ఆ తాగుబోతు సచ్చినోడుతో నీకు జతేటి?" అంటూ మొగుడ్ని కసురుకునేది కనకం.

మామూలుగా వున్నప్పుడైతే... "నీకు తెల్దే అదు మాసెద్ద మంచోడు" అని ఊరుకుండే వాడు. అదే తాగున్నప్పుడైతే మాత్రం "సెప్ నంజా! ఆడ్నేటయినా అన్నావంటే కాల్లిరిసేసి పెణకలో దోపీగల్నుఆడెవుడే! నా గురువు...ఆడే నేకపోతే సారగం సూడకుండానే నా బతుకు తెల్లారిపోను..." అంటూ పెళ్ళాం జుట్టు పుచ్చు కునేవాడు.

వంశధార నది వరదలో పాత హిర మండలం కొట్టుకుపోయినట్టు తాగుడులో మాణిక్యం కొంపా ఆస్తి కొట్టుకుపోయేయి. కొత్త హిర మండలంలో ఓ గుడిశె వేసుకున్నాడు. ఇప్పుడు కనకం కూడా మునుపటిలా 'సీతా మాలచ్చివి' పటంలా లేదు. పొటికిపోయి కీళ్ళు వదులైపోయిన పాత ఫ్రేములా వేలాడిపోయి "చ...డొక్కు ముండా!" అని మాణిక్యం తిట్టే తిట్టుకి అర్హురాలైపోయింది. అందుకే పొదట్లో అడపా దడపా జరిగే పెళ్ళాన్ని తన్నడం అనే కార్యక్రమం ఇప్పుడు మాణిక్యం దినచర్య అయిపోయింది.

ఓ రోజు సత్తెంమేస్త్రి గొట్టా బ్యారేజ్ కేబుల్ వేస్తుండగా పట్టుతప్పి మాణిక్యం పెళ్ళాం అన్నట్టుగా 'తాగుబోతు సచ్చినోడు' అయిపోయేడు. తాగి పన్జేస్తున్నాడనే నెపంతో కాంట్రాక్టర్ కంపెన్సేషన్ ఎగ్గొట్టి అతని పెళ్ళాం పిల్లల నోట్లో మట్టి కొట్టాడు. నిజానికి ఆ రోజు సత్తెం మేస్త్రి తాగిలేడు... ఆ సంగతి మాణిక్యానికి తెలుసు కానీ పులి మాంసం ముట్టలేదంటే నమ్మే


# కైవల్యభూమి

## తీర్థయాత్రలకు విచ్చేయుండి!

ఢిల్లీ నుండి బయలుదేరు డీలక్స్ బస్‌లో మీరు హరిద్వార్, రిషికేష్, యమునోత్రి, ఉత్తర కాశి, గంగోత్రి, గౌముఖ్, సోన్‌ప్రయాగ, కేదార్‌నాథ్, రుద్రప్రయాగ, జోషిమత్, బద్రినాథ్‌లను సందర్శించి 15 రోజులలో ఢిల్లీకి తిరిగి రావచ్చు.

అతితక్కువ ఛార్జీలతో వసతి మరియు రుచికరమైన దక్షిణభారత శాఖాహార భోజనము, వాహన సౌకర్యము, గైడ్ల సహాయము సమకూర్చబడును.

ఢిల్లీ నుండి బయలుదేరే తేదీలు జూన్ 29, జూలై 18, ఆగస్టు 6, ఆగస్టు 25, సెప్టెంబరు 13.

ప్రతి యాత్రకు ఒక నెల రోజులు ముందుగానే బుకింగ్స్ అనుమతించబడును. ఢిల్లీ వరకు వెళ్ళడానికి ప్రయాణ సౌకర్యం కూడా ఏర్పాటు చేయగల్గుతాం.

పరిమితమైన సీట్లు - వివరాలకు ఈ రోజే సంప్రదించండి.

**కైవల్యా టూర్స్**

'లలితా నివాస్', 79, డా॥ రాధాక్రిష్ణన్ రోడ్, మద్రాసు-600 004.

టెలిఫోన్ : 860747, 470741. ఫేక్స్ : 91-44-869668

టెలెక్స్ : 041-6891 IBS IN కేబుల్ : IBSERVICES

కైవల్యా టూర్స్ - మార్గాన్వేషులు

దేవరు?

మొట్టమొదటసారి కొరడా దెబ్బలా 'చెళ్ళు' మని తగిలింది మాణిక్యం మనసుపై తాగుడు కొట్టిన దెబ్బ. ఆ రోజే బోధపడింది తను కూడా ఎంతగా దిగజారిపోయాడో. కొట్టెప్పకుండా గట్టు పై చతికిలబడిపోయి గత వైభవాన్ని నెమరు వేస్తున్నాడు. ఐదారేళ్ళలో తనెంత పతనమయ్యేడో తలచుకొంటే తనపై తనకే అసహ్యం వేసింది.

చీకటి పడుతుండగా ఇల్లు చేరుకున్నాడు. పక్కింటి రామంగాడ్ని వాడి చేతిలో వున్న పుస్తకం చూపించమని ప్రతిమాలుకున్నాడు బుజ్జిగాడు. అయినా రామంగాడు "చూపించనుపో" అని బుజ్జిగాడ్ని నెట్టేసి ఇంట్లోకి పారిపోయేడు. బుజ్జిగాడు నిరాశగా వచ్చేస్తూ మాణిక్యాన్ని చూసి ఒక్క అంగలో దగ్గరకు వచ్చి "అయ్యా నాకూ అమ్మావు పుస్తకం కొనవా?" అంటూ చేతులు పట్టుకు మారాం చేశాడు. మాణిక్యం కంట్లో చివ్వున నీరు చిమ్మింది. ఆ క్షణం అతనికి అనిపించింది తాగుడు మానేయాలని. మానేస్తాన అని నిర్ణయించుకున్నాడుగూడా. మరుసటి దినం పనికి వెళ్ళే ముందు బుజ్జిగాడికి వాగ్దానం చేశాడు ఆ రోజు పుస్తకం తప్పకుండా తెస్తానని.

"ఒరే మానిక్కెం మాటమాట..." అన్న పిలుపుతో ఆలోచిస్తూ నడుస్తున్న మాణిక్యం తేరుకుని ఈ లోకంలోకొచ్చాడు. సినిమా హాలు కెదురుగుండా వున్న టీపాక లోంచి పైకొస్తున్నాడు మాణిక్యాన్ని పిలిచిన 'ఎంకటేశం'. సినిమా టిక్కెట్లు బ్లాక్ వేసి తాగుడికీ, పెళ్ళాన్ని తన్ని తిండికీ సంపాదించుకు బ్రతుకుతుంటాడు ఎంకటేశం.

'ఏంటి' అన్నట్టు చూశాడు మాణిక్యం.


ఎంకటేశం మాణిక్యం చేయి పట్టుకుని ఓ పక్కకు తీసుకెళ్ళి రహస్యంగా "నీకో మంచి బేరం" అంటూ వెనక్కి చూసాడు. అక్కడ తచ్చాడుతున్నాయి రెండు జీన్ పేంట్లు.

"సూస్తన్నావా ఆళ్ళని...టూడెంట్ కుర్రోళ్ళు మనకు తెల్సిన పార్టీలే. ఆరికి నీ కొట్టు తాళాలు ఒక్కనైటుకిత్తే"

"సెస్ లచ్చికే" ఎంకటేశం మాట పూర్తి కాకుండానే ఛస్సుమన్నాడు మాణిక్యం.

"ఆలోసించుకో నలభై ఇత్తారు"

"ఒరె నీ...ఎదవ పన్లుకద్దెకియ్యడానికి నా



కొట్టంటే ఏటనుకున్నావురా గుడిరా గుడి" అంటూ అక్కడ్నుంచి కదిలిపోయేడు.

తాళాలిస్తే కొట్టులో ఏం చేస్తారో మాణిక్యానికి తెలుసు. 'ఏ పొరుగు పల్లె నుంచో రాత్రి ఆట చూసే నెపంతో ఏ ఎదవముండనో రప్పించి రాత్రంతా దాంతో కులుకుతారు ఎదవలు. మాణిక్యం కూడా సత్తెం మేస్త్రితో చానుకెళ్ళినప్పుడు అద్దె సుఖాన్ని రుచి చూడక పోలేదు గానీ...అది దేవుడి పటాలు కట్టే తన కొట్టులోనే జరగడం వాడికి ఇష్టం లేదు.

హాలులో మేనేజరు కోసం వాకబు చేయగా, అతడు ఏదో అర్జెంటు పనిమీద ఇంటికెళ్ళి పోయినట్టు తెలిసింది. 'ఇంక ఇయ్యాల్టికింతే' అని ఉస్సూరుమంటూ వెనక్కి తిరిగాడు మాణిక్యం.

సంజె చీకట్లు అలుముకుంటున్నాయి. కీ అయిపోయిన గడియారం ముళ్ళులా కాళ్ళూ చేతులూ బరువెక్కిపోసాగేయి. కళ్ళ ముందు కల్లు పాకే మెదులుతూంది. కానీ మాణిక్యం బలవంతంగా ఆ దృశ్యం చెరిపేసుకొని బుజ్జిగాడికి 'అమ్మా ఆవు పుస్తకం' కావాలని గుర్తు చేసుకుంటున్నాడు.

నీరసంగా తిరిగొస్తున్న మాణిక్యాన్ని చూసి పరిస్థితిని అర్థం చేసుకున్న ఎంకటేశం "ఏమంటావ్?" అన్నాడు నవ్వుతూ. మాణిక్యం పర్మిషన్ లేకుండానే ఆగిపోయేయి అతని కాళ్ళు. "ఒప్పేసుకో...ఒప్పేసుకో" అంటూ గోల చేయ సాగింది మనసు.

"ఇంకో పదెక్కువిప్పిత్తాను 'ఒప్పేసుకో'" అదును చూసి దెబ్బేసాడు ఎంకటేశం. "కొట్టుకేం డోకానేదు పూచీ నాది" హామీ కూడా ఇచ్చాడు.

'ఒప్పేసుకుంటే...ఈ డబ్బుతో బుజ్జిగాడికి అమ్మా ఆవు పుస్తకం కొనొచ్చుగా' అనుకొన్నాడు మాణిక్యం.

'అవును. కొనచ్చు తప్పలేదు...అందులోనూ ఏభై రూపాయిలు...పుస్తకమూ కొనచ్చు చుక్కేసు కోవచ్చు' మనసు సూచించింది.

ఒక్క క్షణం నిజమే అనిపించింది...అంతలోనే తుళ్ళిపడి "ఒద్దొద్దు ఈ జలమలో సుక్కేసుకోకూడదు" అనుకుంటూ నాలుగడుగులు ముందు కేశాడు.

మాణిక్యం నడుస్తున్నాడు. రొంటిలో వున్న యాభై నోటు నుంచి విద్యుత్తు ప్రవహిస్తోంది. వళ్ళంతా ప్రకంపనాలు...మెదడంతా తిమ్మిరి. మాణిక్యం నిద్రలో నడిచినట్టు చాలాసేపు నడిచాడు. ఆ నడక చాలా దిశలు మార్చుకుంది. చివరికి ఊరవతల ఓ పాకలో చెక్క బెంచీపై అతని దేహం చతికిలబడింది. అది కల్లు పాక.

రొంటిలో యాభైనోటు గుడ్డలో మూట కట్టిన కోడె త్రాచులా బుస కొట్టింది. సీమ సరకు గ్లాసు నిండింది. మొదటి గుటకేశాడు మాణిక్యం...గుండెలోని ఏ గాయానికి తాకిందో గాని భగ్గున మంట-మరో గుటక భగభగ మంట...అప్పుడు మెదిలాడు మసగ్గా బుజ్జిగాడూ.. అమ్మా ఆవు పుస్తకం...!మంట గుండె కాలిపోతూంది. 'అయ్యా! అయ్యా!' ఏడుస్తున్నాడు బుజ్జిగాడు...గొంతుకు గుటకలేస్తూంది మంటల్ని గుటకలేస్తూంది.

'పోనీ అమ్మా ఆవూ పుస్తకంతోపాటు బుజ్జిగాడికి లాగ్గూ చొక్కా కొంటే' ఈ ఆలోచన అయిదో అడుగుని పడనియ్యలేదు. చేతిలో ఎంకటేశం యాభై నోటు పెట్టి గుప్పిట మూశాడు.. కాదనలేకపోయాడు మాణిక్యం. అప్రయత్నంగా నోటు రొంటిలో దోపుకొని కొట్టు తాళాలు తీసిచ్చి ముందుకు కదిలిపోతూ చెప్పేడు "కొట్టులో మేనేజరు బాబు పటాలున్నై బద్రం"

'తను ఓడిపోయేడు...ఈ వ్యసనం కొండ చిలువలా తన అంగాంగాన్ని చుట్టేసింది.. మాణిక్యం బెంచిపై తల వాల్చేశాడు. సముద్రం అట్టడుగు నుంచి చీల్చుకొచ్చిన కెరటంలా దూసుకొచ్చిన దుఃఖపు పొంగు గొంతులో భళ్ళున బద్దలయింది. "ఒరే సత్తెం! నువ్వు సచ్చి బతికిపోనావు. నాను బతికి సస్తన్నానురా..." అంటూ భోరున ఏడ్చేడు మాణిక్యం.

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంటు